# రెండు చావులు

మరోసారి గ్లాసులు మత్తెక్కాయి. మంచు ముక్కలు సగం మునిగి తేలుతున్నాయి. "ఏం బతుకురా వెధవ బతుకు, చావలేం బతకలేం" "నీకేంరా హాయిగా ఇంటికి పోయి పెళ్ళాంపక్కలో పడుకొంటావు. మా పనింతే" "ఉద్యోగం రాదూ, ఏడవదూ, వెధవ కాంపిటేటివ్ ఎగ్జామ్స్" "నేనీడవలేనురా బాబూ బండి, ఎండ్రిన్ తాగి చస్తా" "అందరూ కట్టకట్టుకు చావండి, ఇక్కడ కూడా మీ యేడ్పులేనా?"

ఆ వాతావరణంలో ఇమడని అసందర్భం అత డొక్కడే. సుదూర నక్షత్రంతో గుసగుసలాడుతున్నాయి అతని చూపులు.

"ఏమిట్రా ఆలోచిస్తున్నావు? చెప్ప తగలడు."

"ఏమీ లేదు" అన్నాడేగానీ విప్పి చెప్పకపోతే బుర్ర పగిలిపోయేట్లుంది. మౌనాన్ని వాళ్ళు భరించ లేక పోయారు. మాట్లాడమని మరీ మరీ పట్టు బట్టారు. పెదవి విప్పడంతో వాళ్ళ నోళ్ళు కట్టుబడి పోయాయి. అతడు చెప్పిందిది.

... ... ...

ఏవేవో తిట్లు ఘాటుగా, చేదుగా, సగం ఇంగ్లీషులో సగం తెలుగులో, ఆఫీసరు ఎందుకు తిడుతున్నాడో కూడా తెలీదు. తప్పేమీ లేకుండా తిట్టడు కదా! తిట్టినా ఏం చేయగలడు? తిట్ల వడగళ్ళలో తల వంచుకొని నిలబడ్డాడు మౌనంగా.

"నిన్ను తీసేస్తున్నాం" అన్న పిడుగుతో ఆ వడగళ్ళు వెలిశాయి. ఆఫీసు నుంచి ఎలా బయట పడ్డాడో అతనికే తెలియదు. కాళ్ళు కదపటానికే తంటాలు పడుతున్నాడు. ఒంట్లో పట్టులేదు. జ్వరం, ఒకటే ఎండ. బస్సులూ లారీలూ పిచ్చెక్కినట్లు పరుగెడుతున్నాయి. అంతా మొద్దుబారిపోయింది. అసలేమైందో గుర్తుకు తెచ్చుకోడానికి బ్రహ్మప్రయత్నం చేస్తున్నాడు. కూడలికి వచ్చాక అతనికి గుర్తుకు వచ్చింది, ఉద్యోగం ఊడిందన్న షాక్ కొట్టినట్టు కుప్పకూలిపోయాడు. మీది కొచ్చే లారీకి సడన్ బ్రేక్ పడింది. లేకపోతే తన కథకీ బ్రేక్ పడేది.

"జేబులు వెతకండి అడ్రస్ దొరుకుతుందేమో"

"ఎవడో తాగుబోతు వెధవ; మనకెందుకు?"

"చావాలని లారీకి అడ్డంగా..."

నెమ్మదిగా స్పృహ వస్తోంది. కళ్ళు తెరవడానికి భయపడుతున్నాడు. ఏ దృశ్యం చూడవలసి వస్తుందో, ఏ ముఖం ఎదురౌతుందో! అయినా ఏం చూడాలి!



— రాణి శివశంకర్

తనెక్కడున్నాడసలు? శరీరానికి మెత్తగా తగులుతున్నదేమిటి? పడిపోయింది రోడ్డు మీద కదా! నెమ్మదిగా కళ్ళు తెరిచాడు. ఎవరతడు! ఎక్కడైనా చూశాడా? జ్ఞాపకం ఏమీ కదలాడ్డం లేదు. విసుగు కలిగిస్తూ మృత్యువులోకి చొచ్చుకుపోతున్న విశ్వల కాసారం. "మీరేం చేస్తున్నారు?" అని ప్రశ్నించగానే మళ్ళీ గుర్తుకు వచ్చింది ఉద్యోగం పోయిందని. తీవ్రమైన భయం. ముఖమంతా నల్లని నీడలు జుట్టు పీక్కుంటున్నాడు. తేనె తుట్టెను కదపడం నాదే పొరబాటు" అనుకొన్నాడు డాక్టర్. అచేతనంగా పడి వుంటున్నాడు. ఆకలనడు, దాహమనడు, చూపులకి లక్ష్యం వుండదు. అప్పుడప్పుడూ పురుగులు, మృగాలు, దోమలు, ఈగలు. అయ్యో!అయ్యో వస్తున్నా" అంటూ పిచ్చిగా అరిచి అచేతనంగా పడిపోతాడు. మళ్ళీ ఎపుడో మెలకువ. అవే గురిలేని చూపులు. రెండు రోజుల్లోనే శరీర మంతా ముడతలుపడి వృద్ధాప్యం ముంచుకొస్తున్నట్లున్నాడు. "క్షీణించి పోతున్నాడు. అంచెలంచెలుగా క్షీణించి శిథిలమైపోతున్నాడు. కారణం ఏమిటో అంతు పట్టటం లేదు. పేషెంట్ పెదవి విప్పి బాధేమిటో చెప్పడు, ఎలా?" దీర్ఘాలోచనలో మునిగిపోయాడు డాక్టర్. రోగికి హఠాత్తుగా మెలకువ వచ్చింది. కిటికీ తోరణంలా వేళ్ళాడుతున్న నక్షత్రాలని బట్టి

> బ్రతుకొక పండుగగా సాగడం, బ్రతుకును దినదినగండంగా లాగడం... రెండు రకాలు. అలాగే 'చావు'లోనూ రెండు రకాలు. నిత్యం చచ్చే బ్రతుకు కావాలా? ఎప్పటికీ బ్రతికే చావు కావాలా? ఎంచుకునే వాళ్ళను బట్టి వుంటుందది.

ఆంధ్రప్రభ వారపత్రిక 10-8-90

రాత్రని గుర్తించాడు. చాలా అందంగా వున్నాయి నక్షత్రాలు. మల్లెపూలలాఅందమైనఅమ్మాయితలలో మల్లెపూలలా, ఆమె తలలో మల్లెపూలలా సుదూరంగా కొండపై మెరుస్తున్న నక్షత్రం. అదీ అది ప్రేమ. ఎంత అందమైన ప్రేమంటే ఆమె. ఇప్పుడెలా గుందో? ఆ పురాతన భవంతి దగ్గర ఇదే చివరి సారి. "ఇక వెళ్తున్నా" కన్నీళ్ళు..,

"మంచివాడేనా?" అడిగాడు.

ఏదో అస్పష్టంగా గొణిగింది. అంతే వెళ్ళిపోయింది కొంగుతో కళ్ళు తుడుచుకుంటూ, దూరంగా మలుపు తిరిగింది. "అయ్యో ప్రేమ వెళ్ళిపోయింది" తన అశక్తతవల్ల.

"డాక్టర్...మత్తు మందు, మార్ఫిన్, గంజాయి నన్ను చంపేయండి. నక్షత్రాలున్నాయి. భూమి వుంది. కానీ అంతా ఖాళీ, నువ్వు ఖాళీ, నేను ఖాళీ, వాడు ఖాళీ ఎంత దూరమో ఆ నక్షత్రం? చెయ్యి జాపి అందుకోగలనా? భగవంతుడి దయవల్ల ఈ చెయ్యి అలా అలా సాగుతూ సాగుతూ పోతే పోతే... అప్పటికైనా అందుకోగలనా? నక్షత్రం శిఖరాన్ని చుంబిస్తోంది. ఎంత అందమైన భావన. నక్షత్రం



శిఖరాన్ని చుంబిస్తోంది. నేనో నిరాశనీ నిస్పృహనీ కావలించుకొని...ఐనా నక్షత్రం హాయిగా వుండాలి. నక్షత్రమూ శిఖరమూ హాయిగా చిరకాలం కలసి జీవించాలి. ఈ ఆకాంక్ష అతనిలో జీవం పోస్తోంది. బతికే వున్నానన్న నమ్మకాన్ని బతికిస్తోంది. ఔను. వాళ్ళిద్దరూ కలకాలం హాయిగా కలసి జీవించాలి. ఇప్పుడు తనకి నక్షత్రాలు దగ్గరతున్నాయి.

"వాళ్ళిద్దరూ హాయిగా జీవించాలి. మళ్ళీ మనసులోనే అనుకున్నాడు బలంగా. అప్పుడతనికి ఎవరితోనైనా మనసు విప్పి మాట్లాడాలనిపించింది. డాక్టర్ని పిలిచాడు.

"నిద్ర పట్టలేదా?" అడిగాడు డాక్టర్.

"ఆ...అది కాదు" ఏదో చెప్పాలనుకున్నాడు, బలమైనదేదో సర్వస్వమైన దేదో అతని చేతుల్ని తన చేతుల్లోకి తీసుకున్నాడు. మాటలు అందడం లేదు. హఠాత్తుగా కన్నీళ్ళు ముంచెత్తాయి.

"విషాద స్మృతులతో క్రుంగి పోతున్నాడు. అవి అతనిని బతక నియ్యవు. వెంటనే షాక్ ట్రీట్‌మెంట్ ఇయ్యాలి" నిర్ణయించుకున్నాడు డాక్టర్.

మెలకువ వచ్చింది. చాలా నీరసంగా వుంది. శరీరమంతా చచ్చుబడినట్లుంది. గాలంతా స్తంభించినట్లుంది. కిటికీ లోంచి చూశాడు. ఏవో మెరుస్తున్నాయి. తళ తళ మిల మిలా. ఏమిటవి ఆ మెరిసేవి? జ్ఞాపకం రావటం లేదు. సరస్పెంకి పోయింది. జీవలక్షణం చచ్చిపోయింది. ఆ సుదూర శిఖరంపై ఏవో జారవిడుచుకున్నాడు. అద్భుత మైనది, ప్రాణప్రదమైనది ఆ శిఖరంపై మెరిసే జ్ఞాపకం ఎప్పటికీ దొరకలేదు. ఎంతగానో గింజు కున్నాడు. ప్ప...లాభం లేదు. ఆదుర్దా ఆందోళనల ఉప్పెన. ఇంద్రియాలు క్రమేపీ అశక్తమౌతున్నాయి. రక్తం వేగం వేగంగా సుళ్ళు తిరుగుతోంది. పిలుపు బయట పడబోయేంతలో కంఠ నాళం పుటుక్కుమని తెగిపోయింది. మెదడు నరాలు చిట్లి పోయాయి.

"కొందరంతే రోజు రోజుకూ క్షీణించి భయాల్తో సందేహాల్తో దిగుల్తో వేదనల్తో కొంచెం కొంచెంగా అంచెలంచెలుగా సంవత్సరాల తరబడి చచ్చిపోతారు. వాళ్ళక చికిత్స కూడా రోగంగా వికటిస్తుంది" పెదవి విరిచాడు డాక్టర్.

... ... ...

"స్టూపిడ్" అరిచాడొకడు అసహనంగా చిరాకుగా" ఏ ఉత్సాహమూ లేని చచ్చు కథ."

"అసలింతకీ కథ మొదలే కాలేదు. భయపడుతూ పారిపోతూ చచ్చు సెంటిమెంట్లతో నీరుగారి పోతూ అంచెలంచెలుగా చచ్చిపోవడం ఏ కథకూ ప్రారంభం కాదు. ముగింపు కాదు. అసలు కథే కాదు. ఇక్కడి నుంచే అసలు కథ."

... ... ...

అక్కడ ప్రత్యక్ష మయ్యాడు మరో మనిషిగా. గుర్తించడమే కష్టం. పూర్వపు దిగులూ సందేహం మటుమాయం. రోగ లక్షణాలేమీ లేవు. చూపుల్లో బాణంలాంటి సూటిదనం, చురుకుదనం, నిశ్చలంగా నిటారుగా వున్నాడు. మృత్యువు ఛాతీపై దూకే సింహంలా వున్నాడు. దృఢమైన చేతులతో కరచాలనం చేశాడు. గాలిలో తేలివచ్చిన ఉత్తేజకరమైన డప్పుల చప్పుడు బతికించిందని, అది పిలిచే దిశగా నడిచి నడిచి యిక్కడికి చేరుకొన్నానని చెప్పాడు.

"ఈ దిక్కుమాలిన అడవులలో ఏం పని?"

"ఆయుధాలు తయారు చేయడం, మృగాలని వేటాడటం."

"ఎప్పుడే పొదల చాటు నుంచి దూకుతాయో..."

"ప్రమాదాలని ఢీకొనడం మా స్వభావం."

"ఎంత కాలం ఈ పోరాటం? ఎప్పటికవి అంతరిస్తాయి?"

"అవన్నీ ఆలోచించం. భయాల్తో సందేహాల్తో అంచెలంచెలుగా చచ్చిపోవడమంటే అసహ్యం. పోరాటమే హృదయ స్పందన."

"ఐనా నగరాలలో మృగాల్లేవా?"

"నగరాల్లోని మృగాలు కూడా అడవుల్లో అసలు రూపుతో బయట పడ్తాయి."

కంచు గంటలా మోగుతున్న ఆ కంఠ స్వరం ముందు భయాలూ సందేహాలూ వెలవెల బోతున్నాయి. పోరాట జీవితంలోకి పోవడమే మంచిదనిపించింది ఆ క్షణానికి. నిజమే ఈ క్రూర ప్రపంచంలో పోరాటమొక్కటే ప్రేమాస్పదం" లోపలి మాట అప్రయత్నంగా బయటికి వచ్చేసింది.

"ఐతే వస్తావా?" ఆశగా కళ్ళల్లోకి చూశాడు.

తెగని ఆలోచనలూ సందేహాలూ. వెళ్ళడమా? వెళ్తే వెయ్యి కష్టాల్ని నవ్వుతూనే స్వీకరించాలి. నగరానికి తిరిగి పోతే మామూలే. బతుకు తెరువు కోసం నానా గడ్డీ తినడం, అడ్డమైన వెధవనీ హలో అనడం, అయ్యా అనడం అటూ, ఇటూ, ఇటూ అటూ అటిటూ ఇటుటూ అటిటూటిట.........తెగటం లేదు. చివరి సారి అడిగి వెళ్ళిపోయాడు.

పేపర్లో వార్త "ఎన్ కౌంటర్లో మృతి' అని.

..............

"అయ్యో చచ్చిపోయాడా?" అందరూ ఒక్కసారి ఆదుర్దాగా.

ఔను. కానీ మొదటి చావుకీ రెండో చావుకీ ఏం సంబంధం?

10-8-90 ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక